క్లుప్తంగా

'రైతుబీమా'కు దరఖాస్తుల స్వీకరణ

కేటీదొడ్డి: మండలంలోని మైలగడ్డ, కేటీదొడ్డి, ఇర్కిచేడు, కుచినెర్ల, తదితర రైతు వేదికలలో బుధవారం ఏఈఓలు ప్రియాంక, ప్రీతిసుధ, జ్యోతిలు రైతుబీమా పథకం కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రైతు వేదికలలో క్లస్టర్ పరిధిలోని 120 దరఖాస్తులు స్వీకరించినట్లు ఏఈఓలు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అలంపూర్: ఈ నెల 1వ తేదీన విద్యుత్ మరమ్మతులు చేపడుతున్నట్లు అలంపూర్ సబ్ డిజనల్ ఈడీఈ సయ్యద్ చిన్న మక్బుల్, మానవపాడు ఏఈ సత్తార్ బాషలు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ మానవపాడు, జల్లాపురం, శ్రీనగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతులు, 11 కేవీ ఫీడర్ల లైన్ల కింద పెరిగిన కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

మానవపాడు: మండలంలోని శ్రీనగర్, మానవపాడు, జల్లాపురం గ్రామాల సబ్‌స్టేషన్ల మెయింటెన్స్ సంబంధించి గురువారం ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు 11కేవీ ఫీడర్ల లైన్‌కింద ఉన్న చెట్లకొమ్మలను తొలగింపు ఉంటుందని ఏడీఈ సయ్యద్ చిన్న మక్బుల్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాల విద్యు త్ వినియోగదారులు సహకరించాలని తెలిపారు.

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలి



గద్వాల అర్బన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేసి, బీసీలకు 42శాతానికి రిజర్వేషన్ పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు పెంచితే సుమారు 20వేల మందికిపైగా బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభిస్తుందన్నారు. సమావేశంలో బుచ్చిబాబు, వెంకట్రాములు, విష్ణు, బలరాం నాయుడు తదితరులు ఉన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ బదిలీ



గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహిస్తున్న సంపత్‌కుమార్‌ను శాంతినగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బదిలీ చేస్తూ బుధవారం ఉన్నత విద్యామండలి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు ప్రిన్సిపల్ సంపత్‌కుమార్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కష్టపడి చదువుతూ అనుభవజ్ఞులైన అధ్యాపకుల సలహాలతో అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు. విద్యార్థులు అధిక మార్కులు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

ధరూరులో భారీ వర్షం



ధరూరు: మండలంలో బుధవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వాన పడింది. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు కుండపోతగా కురిసింది. ఖరీఫ్ సాగులో భాగంగా వరిసాగు చేసుకునే రైతులకు కరిగెట చేసుకునేందుకు అనుకూలంగా మారిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల అదుపులో పీడీఎస్‌యూ నాయకులు

గట్టు: పీడీఎస్‌యూ నాయకులను బుధవారం గట్టు పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాష, జిల్లా కార్యదర్శి శివకుమార్, గట్టు మండల అధ్యక్షుడు రాంరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, విద్యారంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని, విద్యాశాఖ మంత్రిని నియమించాలని, కళాశాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ చలో అసెంబ్లీకి పిలుపునిచ్చిన నేపథ్యంలో పీడీఎస్‌యూ నాయకులను పోలీసులు ముందస్తు చర్యల్లో భాగంగా అదుపులోకి తీసుకున్నారు. సాయంత్రం సొంత పూచికత్తుపై పీడీఎస్‌యూ నాయకులను విడుదల చేశారు.

జోరుగా సాగు పనులు

- వరివైపు మొగ్గుచూపుతున్న అన్నదాతలు
- సన్నరకంపై రైతులకు అవగాహన



కొండాపురం శివారులో వరినార్లు పోసిన రైతులు



కేటీదొడ్డి శివారులో ఎద్దులతో పొలాన్ని దున్నుతున్న రైతు

కేటీదొడ్డి: వర్షాకాలం పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షాకాలంలో వర్షాలు సంవృద్ధిగా కురిస్తే చెరువులు, కాల్వల కింద పంటల సాగుతో పాటు వర్షాలతో బోరుబావుల్లో నీటి మట్టం కూడా పెరుగుతుందని రైతులు వ్యవసాయ పనులు మొదలు పెట్టారు. ఇప్పటికే రైతులు పొలాల్లోకి నల్లమట్టిని తరలించారు. పశువుల ఎరువు చల్లారు. ప్రస్తుతం దుక్కి దున్నుతున్నారు. మరి కొందరు జీలుగ విత్తారు. కేటీదొడ్డి మండలంలో అధికారుల సూచనలతో కొంత రైతులు మొక్కజొన్న సాగుచేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. సన్న, దొడ్డు రకం వరి పంటలు, పత్తి సాగు చేయాలని అధికారుల సూచించడంతో రైతులు ఆ దిశగా పనులు ప్రారంభించారు. భారీ వర్షం కురిస్తే వరినాట్లు వేసేందుకు, పత్తిసాగు పనులకు సిద్ధమవుతున్నారు. యాసంగిలో అధికశాతం దొడ్డు రకం వరి సాగు చేశారు. ఇప్పుడు దొడ్డు రకం సాగుకు సిద్ధమైనప్పటికీ అధికారులు సూచనలతో సగం దొడ్డు రకం, సగం సన్నరకం సాగుచేయనున్నారు. కేటీదొడ్డి మండల కేంద్రంతో పాటు కొండాపురం, మైలగడ్డ, పాతపాలెం, ఈర్లబండ, పాగుంట, వెంకటాపురం, ముసల్దొడ్డి, ఇర్కిచేడు, గ్రామాలలో చాలామంది రైతులు నారుమళ్లు పోస్తున్నారు.

పెరగనున్న వరి సాగు విస్తీర్ణం..

వర్షాకాలం పంటలతో వరిసాగు విస్తీర్ణం ఈ సారి గణనీయంగా పెరగనుంది. మొక్కజొన్న పంటను తక్కువగా వేసినట్లు అధికారులు తెల్చిచెప్పడంతో వరి సాగు విస్తీర్ణం 16 వేల ఎకరాలు దాటనుందని అంచనా. అందుకు తగ్గట్టుగా విత్తనాలు, ఎరువులు అందుబాటులోకి తెస్తున్నారు. గతంలో మొక్కజొన్న వేసిన రైతులు ఈ సారి పత్తిసాగు వైపు మళ్లనున్నారు. గతంలో ఎనిమిది వేల ఎకరాల్లో ఉండే పత్తిసాగు ఈ సారి 9 వేల ఎకరాలకు పెరగనుందని అంచనా.

సన్నరకం వరితో మేలు..

వర్షాకాలంలో సన్నరకం వరి పంటలను సాగుచేయడమే ఉత్తమని కేటీదొడ్డి వ్యవసాయాధికారులు గ్రామాల్లో రైతు అవగాహన సదస్సులు నిర్వహించి చైతన్య పరుస్తున్నారు. ఇప్పటికే గ్రామాల్లో రైతు సదస్సులు నిర్వహించారు. సన్నరకం పంటలైన తెలంగాణ సోన, బీపీటీ కరం పంటలను సాగుచేయాలని అధికారులు సూచించారు.

సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి



సన్నరకం పంటలు సాగుచేసే రైతులు నారు సమయం నుంచే సరైన జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి చీడపీడల బాధలుండవు. నారు పోసిన సమయంలోనే జింక్, సల్ఫెట్ వినియోగించాలి. అవసరమైన మేర పొటాషియం వాడాలి. సాగు విషయంలో సలహాలు ఇచ్చేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు చేస్తారు. నారు సమయంలో జాగ్రత్తలు తీసుకుంటేనే పంటకాలంలో తెగులు సోకకుండా ఉండేందుకు అవకాశం ఉంది. రైతుబీమా చేయించుకోని రైతులు రైతుబీమా దరఖాస్తులు చేసుకోవాలని రైతులు సలహాల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలి.

– మహాలక్ష్మి, ఏఓ కేటీదొడ్డి

గ్రామాల్లో సోదరభావంతో మెలగాలి



ర్యాలంపాడ్ సమావేశంలో పాల్గొన్న అధికారులు



కంచుపాడు పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న అధికారులు



చాగాపురంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటేష్

అలంపూర్ రూరల్: గ్రామంలో స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలని ఎంఆర్‌ఐ మాసుంబాషా అన్నారు. మండలంలోని ర్యాలంపాడ్‌లో బుధవారం పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌ఐ మాట్లాడుతూ గ్రామంలో రెండు గ్లాసుల పద్ధతి వీడి సోదరబావంతో మెలగాలన్నారు. కులవివక్ష చూపకుండా కలిసి కట్టుగా ఉండాలన్నారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భరత్ నాయుడు, ప్రజలు పాల్గొన్నారు.

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో పౌరహక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. డీటీ, ఆర్‌ఐ నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నాగరాజు, ఎస్‌ఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

మానవపాడు: పౌరహక్కుల దినోత్సవాన్ని అమరవాయిలో ఆర్‌ఐ గురురాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పౌరహక్కులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ కోసమే చట్టాలు ఉన్నాయన్నారు. పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ తిప్పన్న, అంగన్‌వాడీ టీచర్లు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురంలో పౌరహక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్‌ఐ వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన అతిగొప్ప వరం పౌరహక్కులని, వాటిని కాపాడి ప్రతి పౌరుడికి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఐ బీమ్ సేన్‌రావ్, జేఏ ఈశ్వర్, పెద్దలు పాల్గొన్నారు.

సేవలు చిరస్మణీయం



గద్వాల క్రైం: అంకిత భావంతో చేసిన సేవలు చిరస్మణీయమని ఎస్పీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఎస్పీ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన హేడ్ కానిస్టేబుల్ విజయభాస్కర్‌రెడ్డిని ఎస్పీ సత్కరించారు. 34 ఏళ్లుగా పోలీస్‌శాఖలో ప్రజలకు సేవలు అందించారన్నారు. పలు విపత్కర సమయల్లో సైతం ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా పోలీస్‌శాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా విధులు నిర్వహించారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ ఉంటుందన్నారు. గద్వాల రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో పోలీస్‌శాఖ నుంచి పూర్తి స్థాయిలో సహాయ సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పర్వతాలు, సిబ్బంది, కుటుంబ సభ్యులు ఉన్నారు.

మున్సిపల్ వార్డుల సంఖ్య పెంచాలి



అయిజ: మున్సిపాలిటీలో జనాభా ప్రాతిపదికన వార్డుల సంఖ్యను 27కు పెంచాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ సత్యం బాబుకు బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ అయిజను నగర పంచాయతీగా 2012లో 20 వార్డులతో ఏర్పడిందని, 2018లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యిందన్నారు. నిబంధనల ప్రకారం 27 వార్డులు ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గోపాల కృష్ణ, పట్టణ ప్రధాన కార్యదర్శిలు భగత్ రెడ్డి, ప్రదీప్ కుమార్‌లతో పాటు బీమసేనరావు, ఇబ్రహీం, రఘు, వీరేష్ గౌడ్, రాజశేఖర్, భీమేష్ పాల్గొన్నారు.

బడీడు పిల్లలతో పని చేయించరాదు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

గట్టు: బడీడు పిల్లలతో పనులు చేయించరాదని, పిల్లలను పనుల్లో పెట్టుకునే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ చెన్నయ్య, ఎస్‌ఐ మల్లేష్‌లు తెలిపారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంవీఎఫ్ ఆధ్వర్యంలో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలపై పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ, ఎస్‌ఐలు మాట్లాడుతూ గ్రామాల్లో బడీడు పిల్లలంతా బడికి వెళ్లే విధంగా చర్యలు తీసుకుందామన్నారు. పత్తి చేనుల్లో 14 ఏళ్లలోపు చిన్నారులను పనికి పెట్టుకోవద్దని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మధ్యలో బడిమానకుండా ఉపాధ్యాయులు విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ మహేష్, ఏపీఓ స్వామి, ఎంవీఎఫ్ కో ఆర్డినేటర్లు సాయి కుమార్, సదానందఆచారి, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

పాఠ్యాంశాల ప్రణాళికలపై చర్చ

కేటీదొడ్డి: మండలంలోని కొండాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం కాంప్లెక్స్ హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు అధ్యక్షతన కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బోధన పాఠ్యాంశాల ప్రణాళికపై చర్చించారు. గ్రూపులుగా విభజించి బోధించడం, విద్యార్థులకు పనికల్పించడం వచ్చే నెలలో తరగతి గదిలో బోధించాల్సిన ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. ఎన్ఏఎస్ పరీక్ష గురించి పూర్తి స్థాయిలో సన్నద్ధం కావాలన్నారు. న్యాస్ పరీక్షకు సంబంధించి విద్యార్థులను ఎలా సన్నద్ధం చేయాలో ఆర్పీ చంద్రశేఖర్ వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు స్వాతి, శ్వేత, గోపాల్, హుస్సేన్, రాముడు, రాజు, సీఆర్‌పీ యుగంధర్ ఉన్నారు.

వ్యవసాయానికి 25శాతం నిధులు ఇవ్వాలి



బడ్జెట్ పత్రాలు దహనం చేస్తున్న రైతు సంఘాల నాయకులు

గద్వాల అర్బన్: కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే కుట్ర చేస్తోందని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ జక్కుల వెంకటయ్య అన్నారు. దీనిని నిరసిస్తూ బుధవారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండులో బడ్జెట్ పత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్రం ప్రవేశపెట్టిన 2024-25బడ్జెట్‌లో రుణమాఫీ, పంటలకు కనీస మద్దతు ధర, గ్యారంటీలపై చట్టబద్ధత అంశం ఊసే లేదన్నారు. ఫసల్ బీమాకు రూ.400కోట్లు తగ్గించారని, పీఎం కిసాన్, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయానికి 25శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సమితి రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, గోపాల్‌రావు, సత్యారెడ్డి, తిమ్మప్ప, సురేష్, వినోద్‌కుమార్ ఉన్నారు.

చేనేత కార్మికులకు ఉపాధి కరువు

రాజోళి: చేనే కార్మికులు ఉపాధి కోల్పోయి భవిష్యత్ లేకుండా తయారవుతున్నారని జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ అన్నారు. మండల కేంద్రంలోని వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో బుధవారం చేనేత కార్మికుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఆర్‌డీ 1, ఆర్‌డీ 2పై చర్చిస్తూనే, కార్మికులకు అందాల్సిన సిల్క్ రాయితీపై చర్చించారు. ప్రభుత్వం కార్మికుల సమస్యలు తీర్చడంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.



సాఫీగా సర్వసభ్య సమావేశం



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజా ప్రతినిధులు

అయిజ: మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బుధవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న అధ్యక్షతన మున్సిపల్ కమిషనర్ సత్యం బాబు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మొత్తం 9 అంశాలను ప్రవేశపెట్టారు. వాటిలో ముఖ్యమైనదిగా 2024-25 సంత్సరానికి గ్రీన్ బడ్జెట్ కింద రూ.65.18 లక్షలు కేటాయించారు. మున్సిపాలిటీ పరిధిలో ఆఫీస్ ఫైల్స్‌ను పొందపరుచుటకు రెండు అద్దె గదులను తీసుకున్నందుకు, దానికి సంవత్సరకాలం అద్దె రూ. 43,200 మంజూరు చేయాలని తీర్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మాల నరసింహులు, ఈఏ గోపాల్, కౌన్సిలర్లు సురేష్, నరసింహులు, శ్రీరాములు, ఆంజనేయులు, దేవరాజు, సువర్ణమ్మ, జూలక బేగం, నాగమ్మ, పావని, భాగ్యలక్ష్మి, అనిత, విజయలక్ష్మి, రాణెమ్మ, ఉసేన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



మల్దకల్‌లో మాట్లాడుతున్న సీడీపీఓ కమలాదేవి

మల్దకల్: తల్లిపాలే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యమని సీడీపీఓ కమలాదేవి బాలింతలకు సూచించారు. బుధవారం తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ఆవశ్యకతపై వివరించారు. వారం రోజుల పాటు జరిగే ఈ తల్లిపాల వారోత్సవాలను అన్ని గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు బాలింతలకు 'డబ్బా పాలు వద్దు తల్లి పాలే ముద్దు' అని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు నాగరాణి, బాలమ్మ, సంధ్యారాణి, వాసంతి, తెల్లమ్మ, వెంకటేశ్వరమ్మ, శశికళ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

శిథిలావస్థకు అంగన్‌వాడీ కేంద్రం



మానవపాడులో నెర్రలు బారిన అంగన్‌వాడీ కేంద్రం-1 గోడలు

మానవపాడు: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహణను పాలకులు, అధికారులు పూర్తిగా విస్మరించడంతో శిథిలావస్థకు చేరుతున్నాయి. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ-1 కేంద్రం పరిస్థితి దారుణంగా ఉంది. కేంద్రంలో 20 మంది చిన్నారులున్నారు. అంగన్‌వాడీ కేంద్రం గది లోపల పైకప్పు ఎప్పుడు కూలి చిన్నారులపై పడతదోనని ప్రాణభయంతో ఉంటున్నారు. చిన్నారులు టాయిలెట్స్, బాత్‌రూంకు బయటికి వెళ్తున్నారు. వర్షం వస్తే గదుల్లోకి నీరు వస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సంప్రదించవలసిన అధికారి: సుజాత, సీడీపీఓ, మానవపాడు, సెల్: 9849390386

రుణమాఫీ కోసం బారులు తీరిన రైతులు



అయిజ ఎస్‌బీఐలో రుణమాఫీ వివరాల కోసం లైన్‌లో నిల్చున్న రైతులు

అయిజ: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంట రుణాల మాఫీ రెండో విడత విడుదల కావడంతో బుధవారం మండలంలోని గ్రామాల రైతులు ఆయా బ్యాంకులకు వెళ్లి వివరాలు తెలుసుకునేందుకు గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవడం రైతులందరికి సాధ్యం కాకపోవడంతో నేరుగా బ్యాంకుల వద్దకు వెళ్లి అధికారులను అడుగుతున్నారు. బ్యాంక్‌ల వద్ద రుణమాఫీ జాబితా గోడలకు అతికించకపోవడంతో బ్యాంక్ అధికారులను నేరుగా కలిసి రైతులు వివరాలు తెలుసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం ఉన్నా టెక్నికల్ లోపాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు అధికారులను నిలదీస్తున్నారు.

డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలి



సర్వే చేపడుతున్న సీపీఎం నాయకులు

గద్వాల అర్బన్: అర్హులైన లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఉప్పేరు నర్సింహ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మొదటి వార్డులో డబుల్ బెడ్రూం ఇండ్లపై సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండ్లు లేని పేదలు, వితంతులు, వృద్ధులు, వికలాంగులు అద్దె నివాసాల్లో, శిథిలావస్థకు చేరిన ఇండ్లలో నివాసం ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదారులకు వెంటనే డబుల్ బెడ్రూం ఇండ్లను పంపిణీ చేయాలని, లేదంటే చలో కలెక్టరేట్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, ఆది, శివ తదితరులు ఉన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

మల్దకల్: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్ స్వరూపరాణి వైద్యసిబ్బందికి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బందితో మాట్లాడారు. గ్రామాల్లో వైద్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ అంటువ్యాధుల ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముందని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, వెంకటస్వామి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన



పుల్లూరులో అంగన్‌వాడీ కేంద్రంలో గోడను పరిశీలిస్తున్న అధికారులు

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు, బైరాపురం, బస్వాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలలో వాల్‌పేయింటింగ్‌లను పీఆర్ డీఈ సలీముద్దీన్ పరిశీలించారు. బుధవారం పుల్లూరు అంగన్‌వాడీ కేంద్రం-1, 2లను, బైరాపురం-1, బస్వాపురం-1 కేంద్రాలలో వాల్‌పేయింటింగ్ కోసం గోడలను పంచాయతీ రాజ్ శాఖ డీఈ సలీమ్, మండల సూపర్ వైజర్ ఆస్మా, ఏఈ భరత్ కుమార్ పరిశీలించారు. చిన్నారులకు సులభమైన రీతిలో ఉండేవిధంగా పేయింటింగ్ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయండి



వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్షం నాయకులు

అయిజ: మున్సిపాలిటీలోని ప్రధాన కూడలి వద్ద హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని అఖిలపక్ష కమిటీ సభ్యులు కోరారు. బుధవారం మున్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ మాల నరసింహులకు అఖిలపక్షం కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అఖిలపక్షం కమిటీ అధ్యక్షుడు ఆంజనేయులు మాట్లాడుతూ ముఖ్యంగా పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద, కొత్తబస్టాండ్‌లోని ఆర్టీసీ బస్టాండ్ కూడలిలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. హైమాస్ట్ లైట్లు లేకపోవడంతో రాత్రి సమయంలో చీకటిగా ఉంటోందని, ప్రయాణికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. పట్టణంలోని ముఖ్యమైన కూడలిలో లైట్లు ఏర్పాటు చేయాలని, రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ బల్బులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు వెంకట్రాములు, ఆంజనేయులు, పల్లయ్య పాల్గొన్నారు.

విద్యారంగానికి తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి 7.5శాతం నిధులు కేటాయించి తీవ్ర అన్యాయం చేశారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ మండిపడ్డారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యారంగం బలోపేతం చేయడానికి 30శాతం నిధులు కేటాయించాలని, యూనివర్సిటీల్లో వీసీలను నియమించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపకేతర సిబ్బందిని నియమించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రియింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున్న ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు అశోక్, నరేష్ తదితరులు ఉన్నారు.